# ఆ వీధి కుండి ::

రచయిత :
శ్రీ కవికొండల వర్ధనరావు

గ్రామ 'పంచాయితీ' సక్రమంగానే పనిచేస్తోంది. కక్కూర్తిపడే 'ఘటాలు' యేమీలేవు. మెంబర్ల దగ్గర నుంచి అధ్యక్షుల వారివరకూ, 'ప్యూన్' దగ్గరనుంచి 'ఆఫీసరు' వరకూ శక్తికొలది స్వార్థరహిత 'ప్రజాసేవ' చేస్తున్నవారే!

'ఆవూరు చాలా పరిశుభ్రంగా ఉంటుంది!' ఓ మంత్రివర్యులు బుల్లిపర్యటన సభలో మెచ్చుకున్నారు కూడాను.

ఆవూరులో వీధికో చెత్తకుండి ఉంది. కొన్ని పెద్ద వీధులలో రెండేసి కూడా ఉన్నాయ్! కాని ఒక్క 'కంసాలి వీధి'కి మాత్రం కుండీలేదు. ఆ వీధిలో నైనా ఒకానొకప్పుడు కుండీ ఉండేదే! - కాని 'అది' శిధిలమై పోయింది. శిధిలమై చాలాకాలమైనాయే కారణంచేతో ఆవీధి మళ్ళీ కుండీకి నోచుకోలేదు.

పేరు మట్టుక్కు 'కంసాలివీధి'...వీధి మొత్తంలో ఒక్క 'కంసాలి' కొంపకూడాలేదు. ఉన్నకొంపలు బ్రాహ్మణులవీ, కోమట్లు వీను - వీధి చివరరెండో మూడో కాపులవి కూడా ఉన్నాయ్!

'వీధి మొత్తానికి ఒక్క 'కంసాలి ఇల్లు' కూడాలేదు. వీధికిమాత్రం 'కంసాలి వీది' అని పేరెట్లా వచ్చిందయ్యా?' అంటే - ఆ వీధిలో దశాబ్దాలు తరబడి వశిస్తున్న ఒక్క 'నెరసినగడ్డం' కూడా సంతృప్తికరమైన జవాబియ్యలేదు,

పంచాయితీ 'రికార్డు' లోనూ, తాలూకా 'రికార్డు' లోనూ ఇంకా అన్ని 'ఆఫీషియల్' రికార్డులోనూ 'ఆలానె' ఉన్నది. మన మింక యీ విషయాన్ని తర్కించటం....కాలాన్ని వృధా పుచ్చటం మాత్రమే అవుతుంది!

'కంసాలివీధి' లో చెత్తకుండి లేకపోవటం యీ మధ్య కొద్ది 'రొజ' గానె ఉండి. ఆ వీధిలో ఉంటూన్న వాళ్లు 'కుండీ' లేక పోవటంవల్ల చిన్న చిదపపెంటను దొడ్లలోనె పోసుకుంటున్నారు. దొడ్డి విశాలంగా ఉన్న రెండుమూడు కొంపలవాళ్ళ కది పెద్ద సమస్యగా పట్టలేదు. కాని దొడ్డి విశాలంలేని శాస్త్రిగార్కి, జనార్ధనం గారికి, మూర్తిగార్కి, వెంకటాద్రి గార్కి చాలా బాధకరంగా ఉన్నది, ఇరుకు దొడ్లలో చెత్త పోసుకుంటూంటే పురుగూ పుట్రా చేరుతోంది. జనార్ధనంగారి దొడ్లో రెండు కట్ల పాము పిల్లల్ని చంపారు కూడాను.

కొద్దిరోజుల తరువాత - రోజూ ఇల్లూడ్చిన 'కసపులిస్త్రా'కులు ఇంకా చిన్న చిదప చెత్త ఎవరి అరుగు చివరవారు పోసుకుంటూ వచ్చారు: రోజూ వీధి తుడిచే పాకీది ఏలానూ తుడుచుకుని పోతుందనే సదుద్దేశ్యంతో సుహృద్భావంతో పాకీ మనిషి 'అప్పి' ఏలానో చెత్తంతా వూడ్చి తట్టలోకి ఎత్తుకుని పోతూండేది!

వారం రోజులు గడిచే సరికి అప్పికి 'పైలేరియా' జ్వరంవచ్చింది. దాంతో దాని కూతురు 'పైడి' వీధి తుడవటానికి నియమింపబడింది. ఆమెది 'మాతృశ్రీ' అంత విశాలహృదయంకాదు. ఆమెపైపైనున్న తుక్కు మాత్రమే తుడిచి - 'ఎంగిలాకులు' వగైరా పెద్ద మొత్తాల్ని వదిలేసి చక్కాపోయింది!

శాస్త్రిగారి భార్య, వెంకటాద్రిగారి కోడలు మూర్తి గారమ్మాయి పైడి చర్యకు నిరసన ప్రకటిస్తూ ఓ చిన్న సంగ్రామం' చేసారు! కుమారి పైడిమాత్రం 'శెక్ లెస్' గా జబాబులు చెప్పి వెళ్ళిపోయింది!

''రోజులు మారిపోయాయమ్మా! ... ము న్న ప టి రోజులు కావూ!....'' వెంకటాద్రిగార్ి కోడలు.

''ఏడసింది...వెధవ పీనుగు....దీని తల్లేవయ్యం!'' యీ మాటలు మూర్తిగారమ్మాయివి,

షరా: పై కామెంటన్నీ' పైడికి పరోక్షంలో జరిగి నాయ్!

'క్షమ కవచంబు—' సరే! అప్పి వచ్చే వరకూ ఓపికపడితే తీరిపోతుంది! వారి మనస్సుల వారు సంబాళించుకున్నారు.

అప్పికి జ్వరం తగ్గి పనిలో కొచ్చేసరికి వారం పదిరోజులు పట్టింది. యీ వారం, పదిరోజులలోనూ వీధి ఎంత అసహ్యంగా తయారవ్వాలో అంత అసహ్యం గానూ తయారైంది! అడుగు పెట్టటాన్కి శక్యం లేకుండగా ఉన్నది.

అప్పిరాగానె మూర్తిగా రమ్మాయి రాధ శాస్త్రిగారి శ్రీమతి రామలక్ష్మి, వెంకటాద్రిగారి కోడలు సావిత్రి గుక్క తిప్పుకోకుండా 'పైడి' పై ఘోరంగా కంప్లైంట్ చేసారు. కాని వారి కంప్లైంట్సన్నీ గాలిలో కలసిపోయాయ్. చిన్న మెత్తు సంచలనంకూడా కలుగ లేదు అప్పిలో.

"ఏందమ్మా సెబుతారు? యీసెత్త సీపురికి రాదు," అనేసి మొత్తానికి వీధి తుడవకుండానె వెళ్ళిపోయింది అప్పి.

ఆ వీధిలో చెత్త పరిణామం మాత్రం – రోజు రోజుకీ 'పాపం' లాపెరిగి పోతూనె ఉంది.

అప్పిని ఆ 'వార్డు' నుంచి మరో వార్డు' కి మార్చటంతో కొత్తగా వచ్చిన వన్నెలాడిరామి నాజూగ్గానైనా ఆ వీధిలో ఒక్క చీపురులాగిన పాపాన పోలేదు. దాంతో వీధి మరీ చికాగ్గా తయారైంది! ఆవీధిన నడిచే వారికి రాళ్లు, రప్పలు గుచ్చుకోకుండా మెత్తటి ఎంగిలాకులమీదనుంచి నడిచిపోగల సుఖమయ పరిస్థితి యేర్పడినదనటం అతిశయోక్తి కాదు.

'క్యాంప్' నుంచివచ్చిన మూర్తిగారి మనస్సులో వీధియొక్క అనూహ్య పరిణామదశ చూచేసరికి పరమ అసహ్యం జనించింది!

మర్నాడుదయం 'ధంతధావన' సమయంలో శాస్త్రి

TEL : "SANTHA" TIRUCHY PHONE : 724 FACTORY : TIRUCHY



V. P. N.

ఒరిజినల్
శాంతా వజ్రములు
(రిజిష్టర్డు నెం. 7493)
రాయల్ స్టార్ వజ్రములు
(రిజిష్టర్డు నెం. 7494)

Prop : V. P. నరసిమ్మలు నాయుడు
షరాపు వ్యాపారం

పెద్దబజారు, : : తిరుచిరాపళ్ళి - 8.

వి. పి. పి. ఆర్డర్లు వెంటనే గమనించబడును.

గార్ని, వెంకటాద్రిగారిని, జనార్ధనంగారిని 'కన్సల్ట్' చేసారు మూర్తిగారు...

"మన వీధిలో ఓచెత్తకుండీ వేయించుకుంటే బావుంటుంది! అప్పుడు తప్పనిసరిగా పాకీవాళ్ళు వచ్చి ఎత్తుకుపోతారు. వీధి చికాకు తగ్గుతుంది" – ఇది మూర్తిగారి ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు మిగిలినవారు.

'సరే! అయితే ఓదరఖాస్తు విసరండి!'" - అన్నారు శాస్త్రిగారు.

"ఆ అదెంతపని....అక్కడ 'మంజూరు' కావాలి గాని..." అన్నారు వెంకటాద్రిగారు.

"ఓస్! అదేమంత మహాభాగ్యం ... ఆఫీసులోనే నెరగనివారులేరు—" జనార్ధనంగారు 'సెల్ఫ్ - డబ్బా' వాయించారు,

"భేషు! ఇంకేం? కానీయండి. శుభస్య శీఘ్రం!" దీవెన విసిరారు శాస్త్రిగారు.

మూర్తిగారు 'అప్లికేషన్' వ్రాయటం... వారి అమ్మాయి టైప్ చేయటం...వీధి మెంబర్లంతా సంతకాలు చేయటం...అప్లికేషన్ బోర్డువారి దివ్యసముఖమునకు దాఖలుచేసుకోవటం – రెండు రోజులలో జరిగిపోయినై!—

'ఎప్పుడు 'కుండీ' పడుతుందా'ని అందరూ ఆతృతతో కూడిన మనస్సులతో నిరీక్షిస్తున్నారు.

అనుకున్నంత ఆశించినంత త్వరలో మాత్రం చెత్తకుండీ వేయటం జరగలేదు. జనార్ధనరావుగారి ప్రగల్భాలు ఏమీప్రయోజనాన్ని సాధించలేక పోయాయ్!

శానిటరీ – ఇనస్పెక్టరుగారే అన్నారు- "ఓనెలా పదిహేనురోజులలో కుండీ పడే ఏర్పాటు జర్గవచ్చునని"

నెలా పదహేను రోజులన్నది. రెండునెలలకు దేకేసింది!

ఈ రెండు నెలల్లోనూ 'వీధి' రెండుసార్లు మాత్రమే శానిటరీ మేస్త్రి దగ్గరుండి తుడిపించాడు. ఈ రెండు నెలలలోనూ వీధి పరిస్థితి మీ రూహించుకో గలరనే భావిస్తున్నాను.

ఓ శుభముహూర్తాన్న పదిమంది పదిలంగా తీసుకొచ్చి ఓ కొత్త 'చెత్త - కుండీ' కంసాలివీధి మధ్యగా... శాస్త్రిగారి గుమ్మానికి గజంన్నర దూరంలో అరుగు ప్రక్క వేయబడింది.

శ్రీమతి రామలక్ష్మి—"అరెరె! అదేంటీ?....మా అరుగు దగ్గర వేస్తున్నారు?....గుమ్మానికి దగ్గరైపో లేదూ? అవతలవేపు పైగా వేయండి, యీలాగైతే పుల్లాకులన్నీ మాగుమ్మంలోకి వస్తాయ్! కాకులు, కుక్కలు, పందులు కెలికెయ్యవూ?"....అంటూ నోరూ నెత్తీ బాదుకుంటున్న – పెడచెవిని పెట్టారు శానిటరీ మేస్త్రి వగైరాలు.

శాస్త్రిగారు గ్రామాంతరంలో ఉన్నారు. లేదా ఆయనకూడా వేట కుక్కలా తప్పక మొరిగియుండే వాడే!—

ఆ వీధిన కుండీ వేయగానె – వీధి నివాసులందరి ముఖాలు వికసించాయి, శాస్త్రి ఫేమ్లీ మినహాయింపు. కారణం తమ గుమ్మానికి దగ్గరకుండీ....వీధిలోని వాళ్ళందరి చెత్తతోనూ....కుక్కలు పందులుతో ముసురుకుపోబోతున్న కుండీ వేయబడటమే!

రామలక్ష్మి తప్ప మిగిలిన వాళ్ళంతా (ఆడవాళ్ల మాత్రం) కొత్తకుండీని నింపివేయటమే తమ పరమావిధిగా తలచి అతి త్వరితగతిని నింపి వేయటానిక్కి సత్వరచర్యలు తీసుకున్నారు. నలుగురు గృహిణులూ 'కో-ఆపరేటై' తమతమ దొడ్లలో గత కొద్ది మాసాలుగా పెరిగియున్న పెంటను, శారీరక కష్టాన్ని లెఖ్ఖచేయకుండగా తెచ్చి కుండీని నింపుతున్నారు.

'కుండీ' వేయబడిన క్షణంనుంచీ ముప్పై ఆరు గంటల్లో కుండీ నిండిపోగా మరొక అర్థకుండీ చెత్త కుండీ చుట్టూ 'స్టాక్' పడిపోయింది! యీ వ్యవధిలోనే ఆ వీధిన ఓ భూకంపంలాంటిది జరిగిపోయింది. దాని ఫలితాలు: రామలక్ష్మి ఆవీధి ఆడవారందరికి విరోధిని అయిపోయింది. ఆమె హృదయం పరాభవాగ్నితో దహించుకు పోయింది, ఆరోజు ఆమె భోజనం మానేసి...భోరున ఏడ్చి నగానికి పైగా 'అమృతాంజనం'

డబ్బీ కాళీచేసింది! వీధిలోని ఆడవారంతా రామ లక్ష్మిపై పగతీర్చుకుంటున్నట్లు ఉన్నదీ లేనీ చెత్త తమ తమ దొడ్లలోంచి పెరుక్కువచ్చి పోస్తున్నారు! కుండీ ఎప్పుడో **భర్తీ అయి**పోవటంవల్ల పోస్తున్న చెత్తకుండీ చుట్టూ **గజం** ఎత్తున నిలువై పోయింది. అవి కుక్కలూ, పందలూ కెలికి శాస్త్రిగారి గుమ్మందాకానూ, గుమ్మం ముందు కూడానూ అసహ్యంగా తయారు చేస్తున్నాయ్! వరహావతారాలు, గ్రామసింహాలు తమకు ఆ వీధిన కూడా 'బోర్డింగ్' వసతి కలిగినందుకు చాలా చాలా సంతోషించాయ్!

మూడు రోజుల తరువాత శాస్త్రిగారు కోర్టు వ్యవహారంలోకు దేశై మరీ చక్కావచ్చారు. రోడ్డు మీది నుంచి సందులోకి తిరుగుతూనే ఆయన కళ్ళద్దాలలోంచి కుండీని చూడటం జరిగింది. ఆయన హృదయం ఆనందాశ్చర్యములతో నిండింది, ఆ మరుక్షణంలోనే ఆహృదయమే విషాద రోషములతో నిండిపోయింది. దాని క్కారణం - తమ అరుగు ప్రక్కన....గుమ్మానికి దగ్గరగా ఆ 'చెత్తకుండీ' వేయబడటమే!-

భర్త రాగానే రామలక్ష్మి కాళ్లు కడుక్కొందుకు నీళ్లు కూడా యీయకుండా అదోవిధమైన విచారకంఠస్వరంలో — వీధి గుమ్మంలో నిర్దాక్షిణ్యంగా మంగళవారం ఉవయం కుండీ వేయటం....తను 'గుమ్మాన్కి-



దగ్గిరైంది· కొలది దూరంగా వేయవలసిందిగా' గట్టిగా చెప్పటం....వాళ్లు నిర్లక్ష్యంగా తన మాటను త్రోసి పుచ్చటం...తరువాత కుండీ ఆ వీధి అమ్మలక్కల పుణ్యంగా నిండిపోవటం...తను వారిని అతి కూడదని వారించటంతో - వారు నిరసన తెల్పుతూ చేసిన ఘన కార్యం....దాంతో వారికీ తనకీ జరిగిన వాగ్వివాదం....దాని తాలూకు ఘోరఫలితాలు....పందులు కుక్కలు చేసేహంగామా, గుమ్మంముందు జరిగే 'న్యూసెన్సు' 'తుచ' తప్పకుండగా ఏకరువు పెట్టింది!

"సరే! ఇక్కడనుంచి కుండీ తీసివేయించే మార్గం చూదాం!'' - శాస్త్రిగారు ఆలోచనా నిమగ్నులై అన్నారు,

"చూద్దామని కాదు మీరు చెప్పేది. దీని విషయం త్వరగా చూడకపోతే ఆచారం గంగలో కలుస్తుంది! తరువాత మీ యిష్టం! చూసారుగా గుమ్మం ఎంతరో తగా ఉందో?'' హెచ్చరిక జారీ చేసింది రామలక్ష్మి.

శాస్త్రిగారు ఆలోచనలో పడ్డారు:- 'వీదిగుమ్మంలో ఏలాగైనా కుండీ తీయించుకోకపోతే లాభంలేదు. భరించ లేము' అనుకున్నారు.

మర్నాడే ప్రయత్నించారు, శాస్త్రిగారి ప్రయత్నం వృధాపోలేదు, శానిటరీ ఇనస్పెక్టరుగారింటి లోని రెండు 'బ్రాహ్మణార్థాల' 'ఇన్‌ఫ్యూలెన్స్' సవ్యంగానె వినియోగమైంది!

"పెద్దవారు మీరంతగా ప్రాధేయ పడొద్దు....అలాగే లెండి, ఒహటి రెండురోజులలో...'' - శానిటరీ ఇన స్పెక్టరుగారి అభయవచనంతో శాస్త్రిగారి మనస్సు కుదటబడింది. ముఖంలో ఆనందం విరిసిల్లింది!

"పుత్ర పౌత్రాభి వృద్ధిరస్తు! ధనధాన్య కనకవస్తు వాహన సమృద్ధిరస్తు!....''శాస్త్రిగారు మనస్ఫూర్తిగా దీవించి బయటపడ్డారు,

మూడో రోజు ఉదయం కుండీలోని చెత్తంతా బండి మీదకు ఎత్తుకుపోయారు - పాకీ వాళ్లు. బండితిరగని ఇరుకుసందు మూలంగా నానా అవస్థాపడ్డారువాళ్ళు, ఆరోజు సాయంత్రమే ఆరుగురి ప్రయత్నంమీద కుండీ స్థాన చలనం జరిగింది. దురదృష్టావశాత్తూ కుండీ వెంకటాద్రిగారి అరుగు ప్రక్కకు జరిగింది!

మళ్ళీ చిన్న సంగ్రామంలాంటిది జరిగేదే కాని వెంట్రుక వాసిలో తప్పిపోయింది! వెంకటాద్రి తెలివైన వాడు - 'గుప్‌చుప్' గా వూరుకున్నాడు. సావిత్రమ్మ చూస్తూ వూరుల్లేక ఏదో అనబోయింది....కాని మామ గార్కి, భర్తకు లేని కంపరం తనకెందుకన్నట్లు మెదల కుండా వూరుకొన్నది! పైగా శాస్త్రిగారి శ్రీమతికి జరి గిన 'పరాభవం' ఇంకా ఆమె మర్చిపోలేదు, ఓవేళ నోరు జారినా తనకూ అదే 'ఫేట్' సాక్షాత్కరించ వచ్చును.

గురు తుల్యులు శాస్త్రిగారి పంథానే అనుసరించి - మళ్లీ కుండీని అక్కడనుంచి తీసివేయించుకోవచ్చుననే ధైర్యంతో చూస్తూ వూరుకున్నారు - వెంకటాద్రి, కొడుకు శోభనాద్రీనూ—

శ్రీ శోభనాద్రి ఎవరిని పట్టుకు ప్రాకులాడాడో....ఏలా ప్రాకులాడాడో ఎవరికీ తెలియదుగాని....వారం పదిరోజుల తరువాత ఓనాడు జనార్ధనంగారి దొడ్డిగుమ్మం దగ్గరకు 'చెత్తకుండీ' పుడాయించటం మట్టుక్కు అంద రికీ తెలుసు...చూసారుకూడాను!

ఈ వారం పదిరోజులలోనూ శాస్త్రిగారి అరుగు, గుమ్మాలకు జరిగిన 'మర్యాద' లాటిదే వెంకటాద్రిగారి అరుగు, గుమ్మాలకూ - కూడా జరిగింది!

జనార్ధనంగారు కుండీని తమదొడ్డి గుమ్మంలో వేస్తున్నప్పుడు చూసికూడా ఏమాత్రం చలించలేదు, పెదిమి కదపలేదు...పైగా చిరునవ్వుతూనె కుండీ ఆగ మనాన్ని ఆహ్వానించారు. ఆ 'చిరునవ్వు' అంతరార్థం ఎవరికీ బోధపడలేదు, శానిటరీ మేస్త్రిమట్టుక్కు 'వెధవ కుండీ...వెధవగొడవా' అని గొణుక్కున్నాడు. జనార్ధనరావుగారి ముఖ కవళికలు చూసి గతుక్కు మన్నాడు - చల్లగా జారుకున్నాడు!

ఎన్ని ప్రగల్భాలు కొట్టినా, ఎంతగట్టిగా 'స్వంత డబ్బా' మోగించినా...జనార్ధనరావుగారు మాత్రం ఘటి కుడు. కాదనటానికి వీల్లేదు. పట్టుకోవలసిన వారిని గట్టిగానె పట్టుకున్నాడు!...'తేనీరు' ఇప్పించాల్సిన వారికి తేనీరిప్పించాడు!...బీడీలు ముట్టజెప్పాల్సిన వారికి బీడీలు

ముట్టజెప్పాడు!...మొత్తానికి అందరికంటె అతిత్వరలోనే 'కుండీ' ని మూర్తిగారి అరుగుప్రక్కకు మార్పించాడు.–

పాపం శమించుగాక! జనార్ధనంగారు మార్పించాలంటేనే నొప్పుకోను. జనార్ధనరావుగారు 'కుండీ' ని తమ దొడ్డి గుమ్మంలోంచి తీయించేసుకున్నారు. అంతే!

మూర్తిగారి 'ఆఫీసుటైము' లో 'ఇది' జరిగిపోయింది! రాధ మట్టుక్కు యువకుడైన శానిటరీ మేస్త్రితో పోట్లాడింది! మార్పిడిని నివారించటానిక్కు ఘోరంగా యత్నించింది! – మేస్త్రి తెలివైనవాడు...నాలుగు సంవత్సరాల అనుభవమున్న వాడూను, ఆమెనేమి అన


TEL: "FOUNDRY" PHONE: 535



# MONOBLOCK SET

మావద్ద తయారైన నవీన మానోబ్లాక్ పంపుసెట్టు

ఇతర తయారింపులు సెంట్రిప్యూకల్ పంపులు

1. మోటారు జతలో చేర్చబడినది
2. బెల్ట్ డ్రివన్
3. చెరుకు ఆడెలు
4. గన్ మెటల్ వాల్వులు

5. H. B. ఎస్. ఎఫ్. మోటార్లు రెడి స్టాక్ వెల రు. 500/-

## సుబ్బయ్యా ఫౌండరి

పాపనాయకన్ పాళ్యం :: కోయమత్తూరు

బ్రాంచి నెం:— 21. లింగిచెట్టి వీధి, మదరాసు_1.

ఏజంట్లు:— శ్రీ ఎస్. జె. దాస్ (ఎస్. ఎఫ్. రెప్రెసెంటేటివ్)

న్యూపేట్, చంద్రగిరి (చిత్తూరుజిల్లా)

లేదు. చల్లగా 'వోల్డు – హార్స్' మీద తుర్రుమన్నాడు. మెల్లగా అనుచరులకు 'కుండీని మూర్తిగారి అరుగు వారనే వేసేయమని' చెప్పేసి –

జనార్థనరావుగారు వేరుగాని ... ఉన్నట్టయితే ఆయన్ను కూడా నాలుగు యీడించేదే రాధ.

జనార్థనరావుగారి బావమరిది నెమ్మదిగా చెప్పాడు: "ఫరవాలేదు. మీరూ నాలుగైదు రోజులు లేదా వారం పదిరోజులు భరించాలి, తప్పదు."

అతగాడు మామూలుగానె చెప్పినా – రాధ కాదన లేక పోయింది! – ఎవరినైనా ఎదిరించగలదు...ఎవరిమాటైనా లెఖ్ఖచేయకుండా వుండగలదు. కాని 'దాసు' మాటను ఎదురించే శక్తిని కోల్పోయింది. దానికి 'బాక్ - గ్రౌండు' లో కారణాలు లేకపోలేదు. అవన్నీ మనకు అప్రస్తుతం... అనవసరమూను.

రాధ, మూర్తిగారు అందరికంటె తమ అరుగు ప్రక్కని 'కుండీ'ని ఎక్కువరోజులే భరించారు. ఎటొచ్చీ చెత్తబండి' వాళ్ళకిమాత్రం నాలుగు మూడు రోజుల కొకసారైనా చెత్త ఎత్తుకు పొమ్మని ఆజ్ఞాపించారు మూర్తిగారు పండుగ మామూలు మాత్రం ఘణంగానె ముట్టజెప్పబడింది!

రాధ ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిని పెట్టిన మూర్తిగారు ఒకటి రెండు దఫాలు కన్నులతో చూస్తేగాని నమ్మలేదు – ఆవీధిలోని చంటిపిల్లల పాయఖానాలు తల్లులు తీసుకొచ్చి కుండీలో వేయటం చూసారు మూర్తిగారు. అంతకుముందునుంచీ మేవాసనా 'ఫీ' లవని మూర్తిగారి 'నశ్యం' ముక్కు వీధిగుమ్మంలోకి రాగానె 'దుర్గంధం' భరించలేనంతగా 'ఫీ' లవటం మొదలు పెట్టింది!

ఓరోజు దుర్గంధం మరీ ఘోరమైపోయింది. తల పగిలి పోతోంది. కడుపులోంచి పేగులు బయట పడతాయన్నంత దారుణంగా ఉన్నది. క్రిందటిరోజు పొద్దుటుట ఎవరో ఎవరో సరిగాతెలియదు...చచ్చిన'పందికొక్కు'ని తీసుకొచ్చి కుండీలో పారేసారు. అంత దుర్గంధ భూయిష్టంగా కుండీ తయారవటానిక్కి అదే మూడొంతుల కారణమై యుండవచ్చును – అప్పటికి ఆరు రోజుల నుంచి బండివాళ్ళు రాలేదు కూడాను. ఆ సందున మసిలే వారూ – కుండీకి దగ్గరలోనున్న యిండ్లలోని వాళ్ళూ కూడా ముక్కులు గట్టిగా మూసుకోవలసి ఖర్మదశ ప్రాప్తించింది!

మూర్తిగారు సహనాన్ని కోల్పోయారు!–

సరాసరిపోయి శానిటరీ ఇనస్పెక్టరు గార్ని తీసుకొచ్చారు....విషయమంతా విశదపరిచారు – మూర్తిగారు శానిటరీ ఇనస్పెక్టరు సంసార పక్షపుమనిషి...కాస్తో కూస్తో మంచిచెడ్డలు తెలిసినవాడు కూడాను! – కుండీని. ఆ ఇరుకు సందుని, సందులో నిండిపోయిన దుర్గంధాన్ని చూసి మూర్తిగార్ని ఓదార్చారు.

"ఇంత చేటు 'బేడ్ స్మెల్' వస్తూ 'న్యూసెన్స్' గా వుంటే భరించటం కష్టమే!" అంటూ జేబూరుమాలుతో ముక్కు మూసుకుని – మేస్త్రితో 'బండివాళ్లని మరి అయిదారుగురు ఏనాదివాళ్ళని తీసుకురమ్మని' చెప్పి ఆయన సరాసరి మూర్తి లోపలి సావిట్లోకి వెళ్లిపోయారు - మూర్తిగారితో కలసి -

అరగంటలో బండితో సహా ఎనమండుగురు ఏనాదివాళ్ళు దిగబడ్డారు!....పది నిముషాల్లో ముగ్గురు కుండీలోని చెత్తంతా ఎత్తి మెయిన్ రోడ్డుమీద నిలబెట్టిన బండిలోకి ఎక్కించేసారు. అందులో ఒకాడు కుళ్లిపోయిన పందికొక్కు కళేబరాన్ని తోకపట్టుకుని మేస్త్రిగారిక్కి చూపించాడు. ఆ ప్రదర్శన శానిటరీ ఇనస్పెక్టరుగారికి కూడా చూపును...కాని వారు అప్పటికింకా మూర్తిగారింట్లో 'వావల్ టిన్' పార్టీ స్వీకరిస్తున్నారు!

కుండీ కాళీకాగానే – మేస్త్రి. మిగతా వాళ్లూ 'ఆజ్ఞ' కొరకు ఇన్‌స్పెక్టరుగారి రాక కోసం ఎదురు చూస్తూ అరుగులమీద బైఠాయించారు!

మూర్తిగారు, ఇనస్పెక్టరుగారూ – పది నిముషాల అనంతరం వీధిలోకి వచ్చారు.

'ఆర్డర్' జారీ చేయబడింది!

ఎనమండుగు భుజస్తంభాలమీద కుండీ కదిలింది!

పడమటి దిశగా నడిచింది.

సందు చివరను ఆగింది–

వెంకటర్నంగారి అరుగు వారను నిలబడింది!-

జరుగుతున్న తతంగమంతా వీధి వారంతా 'ఎగ్జిబిషన్' లా చూస్తూనె ఉన్నారు - వెంకటరత్నముగారు గాని వారబ్బాయిగాని ఇంట్లోలేరు - పొలం పనిమీద వెళ్ళారు. వెంకటరత్నంగారి 'ఫేమ్లీ' వారు మాత్రం చూస్తూ ఊరుకున్నారు.

ఆసాయంత్రం—

పెద్ద ఘర్షన జర్గింది...మూర్తిగార్కి కాపులకిన్నీ వెంకటరత్నంగారి పక్షాన్న కావులంతా (ఆ వీధివాసులు) వచ్చారు. మూర్తిగారి పక్షాన్న - ఎవరూ రాకపోవటం శోచనీయం.

'కుండీ వీధి మధ్య నుండాలి!....లేదా వీధి మొదట్లో వుండాలి! - వీధి చివరను వుండటాన్కి యేమాత్రం వీల్లేదు'' అన్నారు వెంకటరత్నంకాపుగారు.

ముందు కొచ్చిన జనార్ధనరావుగారు ఎందువల్లనో తగ్గారు - దాసు మాత్రం మూర్తిగారితో కలిసాడు.

"సరే! మీ అంతుచూస్తా"...అంటే—

"సరే! మేమూచూస్తాం...అంత గాజులు తొడిగించుకుని లేము" అనుకునేటంతవరకూ సంఘర్షణ పెరిగింది. చేయీ చేయీ కలుపుకునే వారే...బల ప్రదర్శన జరుపుకునే వారే! 'పెదకాపు' కనుసైగతో వెంకటరత్నము మిగిలిన వారూ వెనక్కు వచ్చేసారు.

'పిచుకపై బ్రహ్మాస్త్రం దేనికి...చెబుదాను మార్గం రండి!' అని పెదకాపు. కాపుల్ని తీసుకపోయాడు.

కాపులకు కట్టు ఉంది...ఆగామంలో కాపులబలం ఎక్కువకూడాను. ఎటొచ్చీ ఆవీధిలో మాత్రం వున్నవి. మూడు కొంపలే అయినా గ్రామంలో మొత్తం కాపుల గడపే ఎక్కువ.


బాలురు మొదలు వృద్ధులవరకూ

స్త్రీ, పురుషులందరుకూ పూర్ణతృప్తినిచ్చు మా




తంతి: YENKAYCEE. ఫోన్: 199

"నటరాజా" బనియనులు

ఆకర్షణకు, ఆకారమునకు మన్నికకు శ్రేష్ఠమైనవి

తయారుచేయువారు:
నటరాజా నిట్టింగ్ కంపెనీ,
74, కుమరన్ రోడ్డు, తిరుప్పూర్

ఆంధ్రకు, ఒరిస్సాలకు సోల్ ఏజంట్లు:—

ఓరియంటల్ టెక్స్టైల్ ఏజన్సీస్, రాజమండ్రి

ఎల్లా జరిగిందో? ఎప్పుడు జరిగిందో? - ఏమో ఎవరికీ తెలియదు. అది పెదకాపు, వెంకటరత్నముగారి పని అని అందరికీతెలుసు, వారి పాలికాపులకు ఆవిషయం ఇంకా బాగా తెలుసు సరి! మన కా విషయం అనవసరం!-

భళ్ళున తెల్లారే సరికి కుండీ మాత్రం సత్యన్నారాయణమూర్తి గారి ఇంటి ముందు యథాస్థానంలో ఉన్నది. రాధ నివ్వెరపోయింది! - కాని మూర్తిగారు 'చకితులు' కాలేదు. 'ఇది' యీలా జరగవచ్చునని ఆయన రాత్రే వూహించారు. కాపులతో తగూపెట్టుకోవటాన్కి ఆయన యీసారి జంకినమాట నిజం... ఆవూరి కాపులవిషయం ఆయనకు తెలియనిదికాదు. నిన్న జరిగిన 'తుఫాన్' కే ఆయన చాలా బాధపడ్డారు కూడాను-

'కుండీ'ని మళ్ళీ మార్పించాలనే ఉద్దేశం ఆయనకు కలుగలేదు. చేతనైతే కుండీకి ఆ వీధిలోంచి ఉద్వాసనే చెప్పాలనుకున్నారు!—

ఆరోజునే 'దంతధావన' సమయంలో - మూర్తిగారు వెంకటాద్రిగారు, శాస్త్రి, జనార్ధనంగారుల మధ్య'కుండీ' మీద రెండవచర్చ జరిగింది! మొదటిచర్చ ఫలితం; కుండీయొక్క మంచి, ఉపయోగం, కుండీ వేయించుకోవటమున్నూ - ఈ రెండవచర్చ సారాంశము మొదటిదానికి పూర్తిగా వ్యతిరేకము. కుండీవల్లవచ్చే అనర్థాలు, ఆరోగ్యానికి కలిగే దెబ్బలు, రోగక్రిముల పెరుగుదల...యింకా యింకా దుర్వాసన, చికాకు, రోత వగైరా-

'కుండీవల్ల యీసందు ఎంత అసహ్యంగా తయారవుతూన్నదో అందరికీ తెలిసినవిషయమే!...దానివల్ల యీ 'యిరుకు' సందులో మనంపడే ఇబ్బంది అంతా యింతాకాదు...కుండీ మనం వేయించుకోనప్పుడే చాలా హాయిగావున్నది సందు. ఎంత ఇబ్బంది పడ్డా అప్పుడే సుఖపడ్డాం! యిప్పుడు 'దీని' వల్ల ఎంత బాధగా వున్నదో అందరికీ తెలిసొచ్చింది! కుండీ రావటాన్కి పూర్వం వున్న దోమలబాధకంటె - కుండీపడ్డ తర్వాత వచ్చిన దోమల బాధ మరీ అధికమూ, ఘోరమూ అయిపోయింది! ఇంకా యింకా ఎన్నివిధాలుగా కుండీవల్ల ఎన్ని నరక యాతన లనుభవిస్తున్నామో - మీకు తెలియని సంగతికాదు. ఈ రోత, దోమలబాధ, దుర్వాసనల నుంచి మనం మనస్ఫూర్తిగా విముక్తులము కావాలనుకుంటున్నట్లు భావిస్తున్నా. నాతో మీరూ ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను'' - ఈలెక్చరు మూర్తిగారిది.

అందరూ అంగీకారాన్ని తెలియజేసారు!

"అయితే కుండీ మనం నిక్షేపంలా తీయించేసుకోవచ్చును—" మూర్తిగారి 'ప్రపోజల్' కి ఎవరూ అభ్యంతరం చెప్పలేదు...పైగా ఆనందంగా ఆమోదించారు కూడాను - ఒకవేళ అభ్యంతరం పెడితే ఆకుండీ తప్పకుండా ఆ 'అభ్యంతరం' చెప్పిన వారి గుమ్మంలో వాలుతుందని అందరికీ తెలుసు - కొరివితో తల గోక్కునే అవివేకులు కాదు వారు.

'సరే! అయితే యింకేం కానీయండి! శుభస్య శ్రీఘ్రం!' - శాస్త్రిగారి వాక్కు.

'ఆ! అదెంతపని ఆదరఖాస్తు పిటీషను పారేస్తే పోయె...'' ఇంకా ఏదో చెప్పబోయి ఆగిపోయారు జనార్థనరావుగారు.

'అయితే ఎప్పుడో ఎందుకూ ఇప్పుడే!...' అంటూ మూర్తిగారు ముఖప్రక్షాళనం పూర్తిచేసి, 'పిటీషన్' వ్రాసేసారు. ఈసారి తెలుగులో వ్రాయటంమూలాన రాధకు పైప్ పర్క్ తగ్గింది!

పిటీషను చదివి వినిపించారు మూర్తిగారు.

అందరు బావుందని సంతోషిస్తూ సంతకాలు చేసారు-

జనార్ధనరావుగారు వెళ్లి, వెంకటరత్నముగారి చేత సంతకం, పెదకాపుగారి చేత 'నిశాని' వేయించటం... కూడా జరిగిపోయింది!

పిటీషను ఆమూలాగ్రం చదివించుకుని విన్న తరువాతనే సంతకం చేయటం...నిశాని వేయటం జరిగింది.

పెదకాపుగాని, వెంకటరత్నంగారు గాని ఏమీ అభ్యంతరం చెప్పలేదు - మొదటకుండీ వేయించదలిచామని దరఖాస్తు తెచ్చినప్పుడూ ఎదురుమాట చెప్పలేమ... ఇప్పుడూ చెప్పలేదు. అప్పుడూ నవ్వుతూనే అంగీకరించారు...ఇప్పుడూ అంతే!—

ఆరోజునే 'పిటీషను' బోర్డువారికి దాఖలు చేసుకోవటమైంది!

మర్నాడె 'కుండీ' వెళ్ళిపోయింది—మూడు మాసాలు కూడా 'చెత్తకుండీ' 'కంసాలివీధి' లో కాపురం చేయక పోవటం శోచనీయం. పూర్వజన్మ ప్రారబ్ధఖర్మం!—

ఆకుండీ సరాసరి 'మంగలి' వీధిలోకి పోయి వారం పదిరోజులకు పూర్వం పగిలిపోయిన కుండి స్థానాన్ని అలంకరించింది!

కంసాలి వీధి వాసులంతా కుండీ వెళ్ళిపోగానె దారుణమైన కష్టాలు అంతమైనట్టు...తేలిక మనస్సులై నిశ్చింతగా ఊపిరి తీసుకున్నారు.

'కుండీ' వేసినప్పటికంటె - 'కుండీ' తీసుకుపోయిన తరువాత వాళ్ళముఖాలు ద్విగుణీకృత ఆనందంతో వికసించాయ్! అవును మరి 'మానవస్వభావం' ఏమైపోతుంది?

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరిని వుద్దేశించి వ్రాసినదికాదు. రచయితల రచనలకు మేము ఏ మాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు


నేషనల్ శాండల్
ఫేస్ పౌడర్




అత్యుత్తమ వస్తువులతో తయారైనది, మనోహర పరిమళము నిస్తుంది. ఉముక మంట వుండవు. తేజస్సును హెచ్చించి చల్లదనాన్ని నవలిను సమకూర్చుతుంది. ఆంధ్ర ప్రదేశ మంతటా ఏజంట్లు కావాలి.



కోరినవారికి శాంపిల్ ప్యాకెట్ పంపిస్తాము.

ఎం. ఖాదర్ సాహెబ్ అండ్ సన్సు,

(మేనుఫాక్చరింగ్ పర్ఫ్యుమర్స్)

34-F. ఈస్ట్ చిత్తిరై స్ట్రీట్ : : మధురై (ద. ఇ)